ముమ్మరంగా ఆపరేషన్ పరివర్తన్

- మొత్తం నమోదైన కేసులు : 36
- సీజ్ చేసిన సారా : 96.5 లీటర్లు
- ధ్వంసం చేసిన బెల్లం పులుపు : 5,600 లీటర్లు

నర్సీపట్నం: గత నెల నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్ సత్ఫలితాలు ఇస్తోంది. సారా నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్‌ను ఎస్ఈబీ అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దీంతో నర్సీపట్నం ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట మండలాల్లో మద్యం అమ్మకాల ద్వారా నెలకు రూ.15 కోట్ల ఆదాయం వస్తోంది. రోజుకు రూ.40 లక్షల నుంచి రూ.48 లక్షల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్ఈబీ అధికారులు పేర్కొంటున్నారు. సారా ప్రభావిత ప్రాంతాలైన పెదబొడ్డేపల్లి, వెంకటాపురం, పెదపేద, కొంతలం, ధర్మసాగరంపై ప్రత్యేక నిఘా పెట్టి చాలా వరకు సారాను అరికట్టారు. సారాతో పట్టుబడిన నిందితులపైనే కాకుండా తయారుదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. సారా తయారీకి మూలమైన


సారా బట్టీలపై దాడులు చేసిన ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది

నల్లబెల్లం విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. నల్లబెల్లం విక్రయిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎక్కడికక్కడ దాడులు నిర్వహిస్తూ సారా తయారీ, అమ్మకాల నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు.

రూ.14 వేల అపరాధ రుసుం వసూలు..

రెణ్నెల్లలో 36 కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేశారు. 96.5 లీటర్ల సారాను సీజ్ చేశారు. 5,600 బెల్లం పులుపును ధ్వంసం చేశారు. బైండోవర్ కేసులు నమోదు చేసిన వారి నుంచి రూ.14 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. మరో అడుగు ముందుకేసి సారా నుంచి విముక్తి కలిగించి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు ఎస్ఈబీ అధికారులు నడుం బిగించారు. సారా వృత్తిగా జీవించే 32 కుటుంబాలను గుర్తించారు. వీరిలో 30 మందికి డీఆర్‌డీఏ ద్వారా ఒక్కొక్కరికి రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు రుణం మంజూరు చేశారు. ఆపరేషన్ పరివర్తనతో సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంగా ఎస్ఈబీ అధికారులు పని చేస్తున్నారు.

సారా ప్రభావం బాగా తగ్గింది...

ఎస్ఈబీ నర్సీపట్నం సర్కిల్ పరిధిలో 50పైగా గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు జరిగేవి. వీటిని 15 గ్రామాల వరకు తగ్గించగలిగాం. ఆపరేషన్ పరివర్తన్ ద్వారా సారా తయారీ పూర్తిగా అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఎవరైనా సారా తయారీ చేసినా, అమ్మినా ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించి ప్రజలు సహకరించాలి.

– జి.శ్రీనివాస్, సీఐ, ఎస్ఈబీ, నర్సీపట్నం

సత్వరమే అర్జీలు పరిష్కరించండి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందనకు 31 అర్జీలు వచ్చాయని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ మాడుగుల మండలం ఎల్.పొన్నవోలు గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు, ఏపీ వ్యవసాయ సంఘం జిల్లా నాయకుడు శివలంక కొండలరావు వినతి పత్రం సమర్పించారు. తాను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో సూచించారు. స్పందన ఫిర్యాదుల్లో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు వచ్చాయి. వీటిని సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో మండల స్థాయి అధికారులను ఆదేశించారు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

కె.కోటపాడు: దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయించడం వల్ల వారిలో మెరుగైన ఫలితం ఉంటుందని ఫిజియోథెరపిస్ట్ సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక భవితా కేంద్రంలో 15 మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలందించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయుడు బి.ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వల్ల తమ దైనందిన జీవితంలో వారి వ్యక్తిగత పనులు చేసుకుంటారన్నారు. ప్రతీ సోమవారం ఇక్కడ ఈ సేవలను పొందేందుకు చిన్నారులను వారి తల్లిదండ్రులు తీసుకురావాలని కోరారు. సహిత విద్య ఉపాధ్యాయిని సిహెచ్.కన్నమ్మ పాల్గొన్నారు.


దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేస్తున్న సురేష్

క్లుప్తంగా

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: ఉగాది పురస్కారాల్లో భాగంగా గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఉగాది రోజున బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకుడు పి.రంగరాజు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు ఏటా ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం కార్యదర్శి శేషగిరిరావు, హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు

మాడుగుల రూరల్: మహా శివరాత్రి తర్వాత వచ్చే సోమావతి అమావాస్యను పురస్కరించుకుని సోమవారం శివాలయాల్లో శివునికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కె.జె.పురం ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు వి.వి.అగ్రహారం, జంపెన, ఎం.కోడూరు, తదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సంతోషిమాత తీర్థానికి ఆహ్వానం


డిప్యూటీ సీఎంకు అమ్మవారి జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో ఈ నెల 24న నిర్వహించే సంతోషిమాత అమ్మవారి తీర్థానికి హాజరు కావాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు ఆధ్వర్యంలో సోమవారం తారువ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి అమ్మవారి జ్ఞాపిక అందజేసి, శాలువతో సన్మానించారు. నాయకులు ఆడారి కన్నారావు, శానాపతి శ్రీనివాసరావు, శానాపతి బుజ్జి పరమేశ్వరావు, తాకాశి శ్రీను, పుట్టా రాంబాబు, యర్రంశెట్టి అప్పారావు, జె. రామోహన్‌రావు పాల్గొన్నారు.

660 జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్


వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సహాయకుడు సాయికుమార్

కె.కోటపాడు: గొర్రెలు, మేకలు పారుడు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఎ.కోడూరు ఆర్బీకే పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. ఎ.కోడూరు ఆర్బీకే పరిధిలో 660 గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్లు సోమవారం ఆయన తెలిపారు.

నేటి నుంచి తాగునీరు సరఫరా

మాకవరపాలెం: గిడుతూరు తాగునీటి ప్రాజెక్టు ద్వారా మంగళవారం నుంచి తాగునీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి తెలిపారు. ఇక్కడ వరాహనదిలో రక్షితనీటి ప్రాజెక్టు నుంచి నిత్యం 26 గ్రామాలకు తాగునీరు అందుతోంది. వారం రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాగునీటిని పంపింగ్ చేసే మూడు మోటార్లు కాలిపోయాయి. ఈ నేపథ్యంలో మోటార్లకు సోమవారం మరమ్మతులు పూర్తి చేసినట్టు ఏఈ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కె.కోటపాడు: మండలంలోని ఐదు గ్రామాల్లో ఈ నెల 22న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు సోమవారం తెలిపారు. కె.కోటపాడు, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, ఎ.కోడూరు, పాడుగుపాలెం గ్రామాల్లో పాడైన బ్రేకర్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దాం

- ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సత్యం, బూరె బాబూరావు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై మండలంలోని 27 సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో వారు దేవరాపల్లిలో చర్చించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సుధాకర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి వాల్ పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. మండలంలో 156 పోలింగ్ బూత్‌లో 741 ఓట్లు, 157 బూత్‌లో 698 ఓట్లు ఉన్నాయన్నారు. ప్రతి ఓటరు మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేసేలా చైతన్య పరచాలన్నారు. వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ఎన్నికల వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు


ర్యాలీ చేస్తున్న రైతులు, మహిళా సభ్యులు

మాకవరపాలెం: ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు సాధించొచ్చని మండల ప్రకృతి సేద్య సిబ్బంది రమణి, సుదర్శన్ తెలిపారు. మండలంలోని బయ్యవరం, నారాయణరాజుపేట, మల్లవరం, గిడుతూరు గ్రామాల్లో నవధాన్యం సాగు–నేలతల్లి బాగు అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగుతో కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది కవిత, అప్పారావు, రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద లారీ ఓనర్ల ధర్నా


ధర్నా చేస్తున్న లారీ ఓనర్స్

నర్సీపట్నం: పోలీసులు పట్టుకున్న తమ ఇసుక లారీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీటిని అప్పగించకుండా నాలుగు రోజులుగా తిప్పుతున్న ఎస్సై రామారావు, తహసీల్దార్ అన్నాజీరావులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీవో హెచ్.వి.జయరాంకు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరిస్తానని టౌన్ సీఐ ఎస్.గణేష్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై ఎస్సైను సంప్రదించగా ఇసుక పర్మిట్‌లో ముగిసిన గడువు తేదీ ఉండటం, ఇసుక తీసుకెళ్తున్న ప్రదేశం నర్సీపట్నం తప్ప అడ్రస్ స్పష్టంగా లేదన్నారు. రెండు లారీలు, ఒక ట్రాక్టర్‌ను ఆధీనంలోకి తీసుకుని తహసీల్దార్‌కు నివేదించామన్నారు. ఓనర్స్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

నాలుగు పాఠశాలలకు టైల్స్ మంజూరు


పాఠశాలలకు టైల్స్ తరలిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

రోలుగుంట: నాడు–నేడు పథకం రెండో విడత పాఠశాలల్లో నాలుగింటికి టైల్స్ మంజూరయ్యాయి. వీటిలో బీబీ పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల, జానకీరాంపుర, జె.పి.అగ్రహారం, గుర్రాల పాలెం ఎంపీపీ పాఠశాలలున్నాయి. ఎంఈవో సాయిశైలజ ఆదేశాల మేరకు ఎమ్మార్సీ సిబ్బంది శ్రీనివాసరావు, చిరంజీవి సోమవారం వాహనంపై ఆయా పాఠశాలలకు టైల్స్ తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

- ఒకరి అరెస్టు

చోడవరం రూరల్: గౌరీపట్నంలో పెద్దేరు నది నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ బి.అప్పలనాయుడు సోమవారం తెలిపారు. ఇసుక లోడు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, గ్రామానికి చెందిన దొండా రవికుమార్‌ను అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిని, ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారికి ఎస్ఐ, సిబ్బంది కౌన్సెలింగ్ చేసారు. మరొక పర్యాయం పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారికి, మైనర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ

కల్యాణపులోవ తిరునాళ్లు విజయవంతం


సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్

రావికమతం: లక్షలాది యాత్రికులు తరలి వచ్చినా సమన్వయంతో పని చేసి కల్యాణపులోవ తిరునాళ్లు విజయవంతానికి కృషి చేసిన అందరికీ కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తొలి రోజు లక్ష మంది వరకూ యాత్రికులు, రెండో రోజు అమావాస్య కావడంతో రెట్టింపుగా తరలి వచ్చారన్నారు. కొత్తకోట నుంచి అడ్డదారులతో కలిపి 13 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నియంత్రణకు 250 మంది సిబ్బంది పని చేశారన్నారు. సింగిల్ లైన్ రహదారిపై 55 ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు, వేలాదిగా వచ్చే బైక్‌లు, కార్లతో తరచూ రద్దీ అయ్యేదని, మొబైల్ టీంలు, వైర్‌లెస్ ఫోన్లు సహకారంతో ఎక్కడికక్కడ క్రమబద్ధీకరించామన్నారు. ఈ ఏడాది వీఐపీలకు కారు పాస్‌లు బాగా తగ్గించామని తెలిపారు.

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు

ఏపీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు

నాతవరం: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందనడానికి తానే నిదర్శనమని ఏపీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్. జోగినాయుడు తెలిపారు. సోమవారం నాతవరంలో ఆయన్ను సర్పంచులు ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, పెదగొలుగొండపేట ఎంపీటీసీ సభ్యులు మిరపల వెంకటరమణ, శృంగవరం సర్పంచ్ ఉలబాల శ్రీను, రాజుపేట అగ్రహారం సర్పంచ్, పి.కె.గూడెం పీఏసీఎస్ డైరెక్టరు గుడపర్తి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు కామిరెడ్డి లక్ష్మి, వల్సంపేట మాజీ సర్పంచ్ సుర్ల యోగీశ్వరుడు, వైఎస్సార్‌సీపీ సేవా దళ్ మండలాధ్యక్షుడు గవిరెడ్డి కృష్ణంరాజు, నాయకుడు కోల్లు శ్రీను పాల్గొన్నారు.


జోగినాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచులు ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కేజీబీవీలో ఎంపీడీవో తనిఖీ

నాతవరం: మర్రిపాలెం కేజీబీవీని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ మౌలిక సదుపాయాలు, వసతి సముదాయాన్ని పరిశీలించారు. వంటలను రుచి చూశారు. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై పదో తరగతి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. నాడు – నేడు రెండో విడతలో అదనపు భవన నిర్మాణాలు పూర్తయితే మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ ఉంటుందన్నారు. మెనూ విధిగా అమలు చేయాలని, విద్యార్థినుల ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను కలెక్టరుకు నివేదిస్తానన్నారు. పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

ప్రజలతో మమేకం కావాలి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఎంపికైన వీరిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని పార్టీలకు, సిఫారసులకు తావు లేకుండా, ఎటువంటి అవినీతికి అవకాశం లేకుండా నేరుగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ పూర్తిస్థాయిలో ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. గృహసారథులు, కన్వీనర్లు పూర్తిగా ప్రజల్లో మమేకమై ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రభుత్వ పథకాలు ప్రచారం ఎంతైనా అవసరమన్నారు. పార్టీని గృహసారథులు మరింత బలోపేతం చేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు, బైన ఈశ్వరరావు, మండల ప్రతినిధి పతివాడ అప్పారావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో గృహసారథులు, కన్వీనర్లు

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

మాడుగుల: స్థానిక పాల కేంద్రం వద్ద ఈ నెల 22న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యుడు గౌరీపట్టపు మహేష్ కుమార్ తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉదయం 10 గంటలకు ఈ శిబిరం ప్రారంభం కానుందన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు


మాట్లాడుతున్న సర్పంచ్ కన్నయ్యనాయుడు

నర్సీపట్నం: హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా సహాయ సహకారాలు అందించాలని సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ధర్మసాగరంలో గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణకు వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఏఎన్ఎం కె.వెంకటలక్ష్మి, వార్డు మెంబర్ జి.భూలక్ష్మి పాల్గొన్నారు.

డి. సురవరంలో 75 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రవితేజ

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం దొర్ల సురవరంలో కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి బి. రవితేజ 75 మందికి బీపీ, సుగర్, తదితర పరీక్షలు చేశారు. అనంతరం ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పరీక్షించారు. హెచ్ఎం భీశెట్టి ముత్యాలునాయుడు, ఏఎన్ఎం కొండమ్మ, ఎం.ఎల్.హెచ్‌పీ వరలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు కె. నాగేశ్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ఫ్యామిలీ ఫిజిషియన్

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్య సేవలందిస్తున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి తెలిపారు. సోమవారం వి.సంతపాలెంలో 166 మందికి ఓ.పి ద్వారా వైద్యం అందించారు. 11 మందికి ఇళ్లకు వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, వైద్య సిబ్బంది రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సజావుగా జరిగింది. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ కర్రి సత్యం సహా అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి ఈ సమావేశాన్ని నిర్వహించారు.

అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, తహసీల్దార్ ఎం. లక్ష్మీ, సూపరింటెండెంట్ జి.వి.రమణ, సర్పంచ్‌లు బూరె బాబూరావు, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, కర్రి సూరినాయుడు, రెడ్డి సూర్యనారాయణ, గొర్రుపోటు సుధారాణి, అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, అవుగడ్డ రామదేవి, మొల్లి కృష్ణమూర్తి, వంటాకు పైడితల్లమ్మ, గొరపల్లి భాస్కరరావు, మజ్జి దేవి, పోతల వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షులు దాసరి గోపి, బండారు ప్రసాదరావు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశ్వరస్వామికి వసంతోత్సవం

చోడవరం: స్వయంభూ గౌరీశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం నాగవల్లి వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి త్రిశూలస్నానం చేసి వసంతోత్సవ ఊరేగింపును ఆలయ మాడవీధుల్లో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు, వెంకట్రావుల ఆధ్వర్యంలో పండితులు వేద మంత్రాల మధ్య గౌరీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోనేరు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారి త్రిశూల స్నానం చేశారు. అనంతరం కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పప్పల జయదేవ్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ట్రస్టు బోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.


స్వామివారికి త్రిశూలస్నానం చేయిస్తున్న అర్చకులు

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందెం విజేత ఎం.కొత్తపల్లి


పందెంలో దూసుకుపోతున్న ఎడ్లు

కె.కోటపాడు: జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెం విజేతగా ఎం.కొత్తపల్లి నిలిచింది. ఎ.కోడూరు భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో 18 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలను తిలకించడానికి వచ్చిన ప్రజల కేరింతలతో మైదానం సందడిగా మారింది. ఎడ్లు పరుగు పందేల్లో ద్వితీయ స్థానంలో సింహాద్రిపురం, తృతీయ స్థానం వల్లంపూడి, నాల్గో స్థానంలో కె.జె.పురం, ఐదో స్థానంలో కలగాడ, ఆరో స్థానంలో నర్సయ్యపేటకు చెందిన ఎడ్లు నిలిచాయి. వీరికి గ్రామపెద్దలు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు మల్లునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు, సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, ఆర్బీకే చైర్మన్ దొగ్గ సత్యం, బొడ్డు శ్రీను, బోకం ఎర్రునాయుడు (టీచర్), గోవింద పాల్గొన్నారు.